సాక్షి శ్రీకాకుళం

గురువారం । 30 । మే । 2024



జీడి.. తగ్గిన దిగుబడి

జీడి దిగుబడి తగ్గింది. ప్రతికూల వాతావరణమే కారణమంటున్నారు.

- 8లో



కొనసాగుతున్న కౌన్సెలింగ్

పాలీసెట్ కౌన్సెలింగ్ కొనసాగుతోంది. నేడు కూడా కౌన్సెలింగ్ జరగనుంది.

- 8లో



గణిత అష్టావధానం

జిల్లా కేంద్రంలో నిర్వహించిన గణిత అష్టావధానం ఆకట్టుకుంది.బాల మేధావి ప్రజ్ఞకు అంతా అబ్బుర పడ్డారు.

- 8లో

యంత్రాంగం సర్వ సన్నద్ధం

- కౌంటింగ్‌కు ముమ్మర ఏర్పాట్లు
- 1500 మంది వరకు సిబ్బంది
- అసెంబ్లీ, పార్లమెంట్‌కు వేర్వేరు టేబుళ్లు



శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్:

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సమయం దగ్గర పడుతోంది. దీనికి కావాల్సిన సకల ఏర్పాట్లను అధికార యంత్రాంగం సిద్ధం చేస్తోంది. ఇప్పటికే లెక్కింపు సిబ్బందికి శిక్షణలు కూడా పూర్తయ్యాయి. కౌంటింగ్ కేంద్రమైన ఎచ్చెర్ల శివానీ ఇంజనీరింగ్ కళాశాలలో అన్ని ఏర్పా ట్లు పూర్తి చేశారు. ఈవీఎంలు మూడు అంచెల భద్రతలో ఉన్నాయి. వాటిని జూన్ 4న లెక్కించేందుకు అంతా సిద్ధమైంది. మాక్ లెక్కింపు కూడా చేపట్టా రు. అంటే పూర్తి స్థాయిలో లెక్కింపునకు సన్నద్ధమైనట్టే.

జిల్లాలోని ఒక పార్లమెంటు, ఎనిమిది అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ పర్యవేక్షణలో లెక్కింపునకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ లెక్కింపునకు సుమారుగా 15 వందల మంది సిబ్బందిని వినియోగిస్తున్నారు. ఆర్‌ఓల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు ఏ పనిచేసేవారికి ఆ పనిలో పూర్తి అవగాహన కలిగించే విధంగా చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే ప్రతి విభాగంలో కనీసం మూడు పర్యాయాలు శిక్షణ ఇచ్చారు. అవసరమైన అంశాల్లో వీడియోలు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.

లెక్కింపు సిబ్బందికి దిశా నిర్దేశం

ఓట్ల లెక్కింపు ప్రక్రియపై సిబ్బందికి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ దిశా నిర్దేశం చేశారు. ఈ ప్రక్రియ లో సూపర్‌వైజర్ల పాత్ర కీలకమని అన్నారు. జూన్ 4 న శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్లు లెక్కింపు ప్రక్రియకు సంబంధించి స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఓట్ల లెక్కింపు సూపర్‌వైజర్లు, అసిస్టెంట్ సూపర్‌వైజర్ల రెండో విడత శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆయనతో పాటు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు కూడా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ మాట్లాడుతూ కచ్చితమైన, సమర్థమైన ఓట్ల లెక్కింపునకు అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలతో సిబ్బందిని సన్నద్ధం చేయడం ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. జిల్లాలో ఎలాంటి సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల నిర్వహణ స్ఫూర్తితో ఓట్ల లెక్కింపు ప్రక్రియను కూడా విజయవంతంగా నిర్వహించాలన్నారు. పోలింగ్ రోజు పోలింగ్ కేంద్రంలో పీఓకు ఎంత బాధ్యత ఉందో అంతే బాధ్యత ఓట్లు లెక్కింపు కేంద్రంలో సూపర్‌వైజర్లపై ఉందన్నారు. అధికారులు సిబ్బంది సమన్వయంతో ఓట్ల లెక్కింపు కేంద్రంలో పని చేయాల్సి ఉంటుందని, ఎలాంటి సొంత నిర్ణయాలు తీసుకోకూడదని తెలి పారు. ఓట్లు లెక్కింపులో ఏదైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. కౌంటింగ్‌కు విధులు కేటాయించిన సిబ్బంది అందరూ జూన్ 4న ఉదయం 6 గంటలకు శివానీ ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు.

శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గం, 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు కేంద్రాలను వివిధ బ్లాక్‌లలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి సెగ్మెంట్లులో ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుళ్లు ఏర్పాటు చేస్తామని, కౌంటింగ్ ప్రక్రియలో ఏ సమస్య వచ్చినా వెంటనే ఆర్‌ఓకు తెలియజేయాలన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఈవీఎంలలో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే సంబంధిత బెల్ కంపెనీ ఇంజినీర్లు అందుబాటులో ఉంటారని వెంటనే వారికి తెలియజేయాలన్నారు.

ఓట్లు లెక్కింపు కేంద్రంలోకి ఆర్‌ఓలు, ఎన్నికల పరిశీలకులు మాత్రమే సెల్‌ఫోన్లు తీసుకుని వెళ్ల వచ్చునని, మిగిలిన అధికారులు, సిబ్బంది ఎవ్వరు కూడా కౌంటింగ్ కేంద్రంలోని సెల్‌ఫోన్లు తీసుకువెళ్ల కూడదని చెప్పారు. అక్కడ సెల్‌ఫోన్స్ కోసం ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్ (ఈటీబీపీ), ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్‌లు (ఈవీఎం), ఓటర్ వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రైల్స్ (వీవీ ప్యాట్ ట్రయల్స్) వంటి వివిధ అంశాలపై, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్ సూపర్‌వైజర్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. శిక్షణ తరగతుల్లో పలువురు సూపర్‌వైజర్‌లు, అసిస్టెంట్ సూపర్‌వైజర్‌లు అడిగిన పలు సందేహాలను జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ నివృత్తి చేశారు. శిక్షణ తరగతుల్లో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎం. వెంకటేశ్వర రావు, నోడల్ అధికారి ఎస్.బాలాజీ, మాస్టర్ ట్రైనర్లు శేషగిరి, మెప్మా పీడీ కిరణ్ కుమార్, ఓట్లు లెక్కింపు సూపర్‌వైజర్లు, అసిస్టెంట్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

16 గదుల్లో కౌంటింగ్



- కౌంటింగ్‌కి 16 గదులు వినియోగిస్తున్నారు.
- పోస్టల్ బ్యాలెట్‌కి మరో నాలుగు గదులు వినియోగిస్తారు.
- వీటిలో అసెంబ్లీకి 8 కాగా, పార్లమెంట్‌కి 8 గదులు ఉంటాయి.
- ప్రతి అసెంబ్లీ స్థానానికి, పార్లమెంటు స్థానానికి ఆర్వోలు ఉంటారు. అలాగే వారికి సహాయంగా తహసీల్దారు కేడరు అధికారి ఏఆర్వోగా ఉంటారు.
- ఇలా ప్రతి నియోజకవర్గానికి ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు, మైక్రో అబ్జర్వర్లు, స్కానింగ్, అధికారులు ఇలా కింది స్థాయి వరకు ఏర్పాటు చేశారు.
- ఓట్ల లెక్కింపు అసెంబ్లీ నియోజకవర్గంలో ఉండే పోలింగ్ స్టేషన్ల ఆధారంగా, రౌండ్లపై ఆధారపడి ఉంటుంది.
- ఒక రౌండులో 14 పోలింగ్ స్టేషన్ల ఫలితాలు వెలువడుతాయి.
- తక్కువ పోలింగ్ స్టేషన్లు ఉండే నియోజకవర్గంలో ముందుగా ఫలితాలు వెలువడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆదిత్యుని సన్నిధిలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్



చీఫ్ సెక్రటరీ నీరబ్ దంపతులకు ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న కృష్ణమాచార్యులు

అరసవల్లి: సూర్యక్షేత్రం అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామిని రాష్ట్ర అటవీ, ఇంధన, సైన్స్ అండ్ టెక్నాలజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్ ప్రసాద్ కుటుంబసమేతంగా బుధవారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ సంప్రదాయం ప్రకారం ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు, అర్చకులు ఇప్పిలి రంజిత్ శర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ విశిష్టతను వివరిస్తూ.. నీరబ్ కుమార్ కుటుంబ సభ్యుల గోత్రనామాలతో విశేష పూజలు చేయించారు. అనంతరం వేదాశీర్వచనాన్ని అందజేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీకూర్మనాథుడిని దర్శించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

కంచిలి: మండలంలోని బూరగాం గ్రామం వద్ద జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులు బుధవారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు వివరాలు తెలిపారు. బూరగాం గ్రామానికి చెందిన బుడ్డ మోహిని గ్రామాల్లో తిరుగుతూ వివిధ రకాల పప్పులు అమ్ముకొని జీవనం గడుపుతుండేది. ఎప్పటిలాగే మంగళవారం ఇంటినుంచి బయలుదేరి జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న కోళ్ల తీసుకెళ్లే వాహన డ్రైవర్‌తో మాట్లాడుతుండగా, ఇచ్ఛాపురం నుంచి పలాస వైపు వెళ్లే అశోక్ లేలాండ్ మినీ వ్యాన్ అతివేగంగా వచ్చి, ఆగి ఉన్న కోళ్ల వాహనాన్ని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆగి ఉన్న వాహనం కదిలి బూరగాం గ్రామానికి చెందిన బుడ్డ మోహినిని ఢీకొట్టడంతో ఆమె తలకు, ఛాతీకి తీవ్రగాయాలయ్యాయి. ఆమెతోపాటు ప్రమాదానికి కారణమైన వాహనంలో ప్రయాణిస్తున్న కాకినాడ దగ్గరలో గల పెద్దాపురం మండలం గోరంట్ల గ్రామానికి చెందిన డ్రైవర్ కలగ నానికి స్వల్ప గాయాలవ్వగా, పక్కన ఉన్న మరోవ్యక్తి నాయుడు జయ బాబుకు కాళ్లు విరిగాయి. దీంతో వీరిని హుటాహుటిన సోంపేట ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. తీవ్రగాయాలపాలైన మోహినిని అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం జెమ్స్‌కు తరలించారు. మోహిని సోదరుడు బుడ్డ గణేష్ ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్‌ఐ వి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బెజ్జిపురంలో చోరీ



తెరిచి ఉన్న చెక్క బీరువా

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని బెజ్జిపురం గ్రామంలో పదహారున్నర తులాల బంగారు వస్తువులు, రూ.17 వేలు నగదు చోరీ చేశారు. వివరాల్లోకి వెళితే బెజ్జిపురం గ్రామానికి చెందిన తాళ్లబత్తుల సూరిబాబు తన కుటుంబంతో కలిసి ఎస్.కోటలోని కూతురి ఇంటికి సోమవారం వెళ్లి తిరిగి బుధవారం వచ్చారు. ఇంటి తలుపు తీసి చూడగా ఇంటి వెనుక డోర్ తీసి ఉంది. పైన ఉన్న రూము డోర్ కూడా తీసి ఉండటంతో పాటు చెక్క బీరువా పగలగొట్టి ఉంది. అందులో ఉన్న బంగారు వస్తువులు, నగదు కనిపించకపోవడంతో సూరిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. లావేరు ఎస్‌ఐ సీహెచ్ స్వామి నాయుడు కేసు నమోదు చేశారు.

విజ్ఞానం పెంపొందించుకోవాలి

శ్రీకాకుళం అర్బన్: చదువుతో పాటు విద్యార్థులకు విజ్ఞానం కూడా అవసరమని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బి.కుమార్‌రాజు అన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు సమాజం అంటే ఏమిటి, సమాజంలో ఎలా వ్యవహరించాలో రిసోర్స్ పర్సన్ తిరుపతిరావు విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు సులభంగా గణితం చేయటంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ డిప్యూటీ లైబ్రేరియన్ వీవీజీఎస్ శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ పీవీ భాస్కరరాజా, విద్యార్థులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతపై సమీక్ష



శివానీ కళాశాలలో భద్రతపై సమీక్షిస్తున్న ఎస్పీ రాధిక

ఎచ్చెర్ల క్యాంపస్: స్థానిక శివానీ ఇంజినీరింగ్ కాలేజీలో జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ నేపథ్యంలో కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లను ఎస్పీ జీఆర్ రాధిక బుధవారం పరిశీలించి, కళాశాలలో కౌంటింగ్ రోజు భద్రత ఏర్పాట్లపై సమీక్షించారు. కౌంటింగ్‌కు ప్రణాళిక ప్రకారం భద్రత ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఏజెంట్లు, పోటీ చేసిన అభ్యర్థుల ప్రవేశ మార్గాలు, వాహనాల పార్కింగ్, మూడంచెల భద్రత పర్యవేక్షించారు. ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవటం, జనాలు గుమిగూడకుండా ప్రత్యేక దృష్టి పెట్టడం వంటి అంశాలపై చర్చించారు. కౌంటింగ్ ప్రక్రియ ఎన్నికలు సంఘం మార్గదర్శకాల మేరకు జరగాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్, డీఎస్పీలు వై.శృతి, ఎల్.శేషాద్రి నాయుడు పాల్గొన్నారు.

31న పాసింజర్ రైలు రద్దు



కాశీబుగ్గ: పలాస నుంచి విశాఖపట్నం, విశాఖపట్నం నుంచి పలాసకు జిల్లా మీదుగా నడిచే పాసింజర్ రైలు(07471/07470) ఈ నెల 31వ తేదీన రద్దు చేస్తున్నట్లు ఈస్ట్ కోస్ట్ రైల్వే చీఫ్ పాసింజర్ ట్రాన్స్‌పోర్టేషన్ మేనేజర్ డీఆర్ పాల్ భువనేశ్వర్ రైల్‌సదన్ నుంచి సమాచారాన్ని అన్ని రైలు నిలయాలకు చేరవేశారు. పూండి-నౌపడ అప్‌లైన్‌లో ఉన్న బ్రిడ్జి నంబర్‌లు 1221/1222 వద్ద మరమ్మతులు చేపడుతున్న సందర్భంగా నిలిపివేస్తున్నామని, అదేవిధంగా రైలు నంబర్ 06090 సంత్రగచి-తెంబరావ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ 31వ తేదీ మూడున్నర గంటలు ఆలస్యంగా నడుస్తుందని, 20896 భువనేశ్వర్-రామేశ్వర్ ఎక్స్‌ప్రెస్ 31వ తేదీ గంట సమయం ఆలస్యంగా నడుస్తుందని, 06222 ముజాఫర్-మైసూర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు 30వ తేదీ గంటంపావు ఆలస్యంగా నడుస్తుందని తెలిపారు. 29వ తేదీన 06104 డిబ్రుఘర్-న్యూనాగర్ కోల్ స్పెషల్ రైలు నాలుగు గంటలు ఆలస్యంగా నడిచిందని తెలిపారు. రైలు రద్దుతో పాటు సమయాల్లో మార్పులను గమనించి జిల్లా ప్రయాణికులు సహకరించాలని కోరారు.

జూన్ మొదటి వారంలో భారీ మొక్కలు నాటే కార్యక్రమం



మాట్లాడుతున్న రత్నాల వెంకట వరప్రసాద్

శ్రీకాకుళం అర్బన్: జూన్ మొదటి వారంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా చేపడతామని శ్రీకాకుళం జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రత్నాల వెంకట వర ప్రసాద్ చెప్పారు. శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వివిధ అనుబంధ శాఖల సహకారంతో స్వచ్ఛంద సంస్థలు సంపూర్ణ సహకారాన్ని తీసుకొని పెద్ద ఎత్తున మొక్కలు నాటుతామని స్పష్టం చేశారు. ప్రాణవాయువును ఇచ్చే మొక్కలు నాటి వేసవి తాపాన్ని కొంత వరకు నివారించవచ్చు అని అన్నారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని అన్ని స్వచ్ఛంద సంస్థలు విధిగా చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతకన్నా ముందు స్టార్ వాకర్స్ క్లబ్ కో-ఆర్డినేటర్ ఎస్.జోగి నాయుడు సారథ్యంలో వివిధ స్వచ్ఛంద సంస్థలు, నడక సంఘాల నాయకులు రత్నాల వెంకట వర ప్రసాద్‌ను ఘనంగా సత్కరించి సమాజానికి వారు అందించే సేవలను కొనియాడారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు జి.ఇందిరా ప్రసాద్, పీజీ గుప్తా, గుడ్ల సత్యనారాయణ, బెవర వెంకట రవి శంకర్, బత్తుల దేవీప్రసాద్, ఎం.మల్లిబాబు, జి.లక్ష్మి, గురు ఆనందరావు, గుడ్ల జగ్గారావు, జి. వాసుదేవరావు, డాక్టర్ జి.నారాయణరావు, వై. మోహన్, సాయిరామ్, నాగేశ్వర ఈశ్వరరావు పాల్గొన్నారు.

మద్యం బెల్ట్ దుకాణదారులకు హెచ్చరిక



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్‌ఈబీ అడిషనల్ ఎస్పీ గంగాధరరావు

రణస్థలం: జూన్ నెల 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో మద్యం బెల్ట్ దుకాణదారులు అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ డి.గంగాధరరావు తెలిపారు. మండల కేంద్రంలోని రణస్థలం ఎస్‌ఈబీ కార్యాలయాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా గతంలో బెల్ట్ షాపుల దుకాణదారులపై నమోదు చేసిన బైండోవర్ కేసులు, సీజ్ చేసిన వాహనాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ రికార్డులు పరిశీలించి తగు సూచనలు చేశారు. ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా జూన్ నెలలో 3, 4, 5వ తేదీల్లో మూడు రోజుల పాటు మద్యం విక్రయాలు నిలిపివేస్తున్నామని, బెల్టుషాపుల్లో మద్యం విక్రయాలు జరగకుండా చూసుకోవాలని తెలిపారు. ఆ సమయంలో మద్యం విక్రయిస్తూ దొరికితే కేసు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్‌ఈబీ ఎస్‌ఐలు ఎం.రవిప్రసాద్, నాగలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

టెక్కలి: విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సంఘం అధ్యక్షుడు ఎల్.రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం టెక్కలి సమీపంలో సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 20 ఏళ్లుగా నుంచి మీటర్ రీడర్లుగా పనిచేస్తున్నా కనీసం ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు. సంస్థకు ఆదాయాన్నిచ్చే విభాగంలో కాంట్రాక్టర్ల వద్ద విధులు నిర్వర్తిస్తున్న మీటర్ రీడర్ల సమస్యలపై గతంలో యాజమాన్యం హామీలిచ్చినప్పటికీ వాటిని అమలు చేయలేదన్నారు. కేంద్రం తీసుకువచ్చిన స్మార్ట్ మీటర్ల విధానంతో మీటర్ రీడర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు ఆర్.కుమారస్వామి, వి.ప్రసాద్, పి.శ్రీనివాసరావు, సీహెచ్.అప్పలనాయుడు, తుల సీదాస్, ఎం.కృష్ణ, కె.శంకరరావు పాల్గొన్నారు.

జూన్ 29న జాతీయ లోక్ అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ లోక్ అదాలత్‌ను జూన్ 29న నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. జిల్లా కోర్టులోని కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 29న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ చేయాలని సూచించారు. మార్చి 16న జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో పోలీసు సిబ్బంది ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ చేశారని, అదే స్ఫూర్తితో జూన్ 29న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో కూడా ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ చేయడానికి కృషి చేయాలని ఆయన కోరారు. పోలీసులు వ్యక్తిగత శ్రద్ధ వహించి కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లాలోని అదనపు జిల్లా న్యాయమూర్తులు పి.భాస్కరరావు, మహేంద్ర ఫణికుమార్, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, అడిషనల్ ఎస్పీ ఉమామహేశ్వరరావు, డిసిఆర్బి సీఐ సోమశేఖర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు తంగి శివప్రసాద్, సుశీల ఉషా కిరణ్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

విత్తన ఎంపికే కీలకం

- సబ్సిడీపై రైతులకు వరి విత్తనాలు
- 656 రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీకి చర్యలు
- రైతులకు అందుబాటులో పలు రకాల వరి విత్తనాలు
- జిల్లాలో వరి విస్తీర్ణం 1.78 లక్షల హెక్టార్లు
- అందుబాటులో ఉన్న వరి విత్తనాలు 35,009 క్వింటాళ్లు



రైతుల కోసం సిద్ధంగా ఉన్న వరి విత్తనాలు

ఆమదాలవలస రూరల్: ఖరీఫ్ సీజన్ మరికొన్ని రోజుల్లో ప్రారంభం కాబోతుంది. రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్నారు. అయితే ఖరీఫ్‌లో విత్తనాల ఎంపికే అన్నింటి కంటే కీలకమని వ్యవసాయ శాఖాధికారులు అంటున్నారు. ఏ రకం వేస్తే తెగుళ్లను, వాతావరణ పరిస్థితులను తట్టుకుని అధిక దిగుబడులు ఇస్తుందో తెలుసుకుని సాగు చేయాలని సూచిస్తున్నారు.

ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 5 నెలల కాలపరిమితిలో పంట సాగు చేస్తే ధాన్యం దిగుబడులు చేతికి వస్తాయి. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం ఇప్పటికే రైతులకు అందుబాటులోకి రైతు భరోసా కేంద్రాలను తీసుకువచ్చి వాటి ద్వారా రైతులకు విశిష్ట సేవలను అందిస్తోంది. వ్యవసాయాన్ని పండగలా చేసుకునే విధంగా ప్రభుత్వం రైతులకు అనేక సంక్షేమ పథకాలతో పాటు రైతులకు కావాల్సిన విత్తనాలను సరఫరా చేస్తోంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఏ రకం విత్తనాలు కావాలో ముందుగానే ఆర్డర్ చేసుకోవడం వల్ల ప్రతి రైతుకు సకాలంలో విత్తనాలు అందుతున్నాయి. ఇలాంటి సమయంలో రైతులకు నచ్చిన విత్తనాలను ఎంపిక చేసుకునేందుకు శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు పలు సూచనలు చేస్తున్నారు. జిల్లాలోని 30 మండలాల పరిధిలో 1.78 లక్షల హెక్టార్లల్లో వరి సాగవుతోంది. జిల్లాలో ఇప్పటికే 656 రైతు భరోసా కేంద్రాల ద్వారా 35,009 క్వింటాళ్ల విత్తనాలను రైతులకు సబ్సిడీపై అందజేసేందుకు ప్రభుత్వం తగిన ఏర్పాట్లు పూర్తి చేసింది. రైతులు తగిన విత్తనాలను ఎంపిక చేసుకుని సాగు చేసుకుంటే అధిక దిగుబడులు సాధించగలరని మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు సలహాలు, సూచనలు ఇస్తున్నారు. గత మూడేళ్లగా రైతులు వరిసాగు చేసి ప్రయోగాత్మకంగా వాటి ఫలితాలు రావడంతో వరి విత్తనాల రకాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు.

అందుబాటులో ఉన్న విత్తనాలు

- ఎంటీయూ 1121 శ్రీ ధృతి రకం పంటకాలం 140-142 రోజులు. ఎకరాకు 28.30 బస్తాల దిగుబడి వస్తుంది. ఆకు ముడత పురుగును తట్టుకునే రకం.
- ఎంటీయూ 7029 స్వర్ణ రకం పంటకాలం 150-152 రోజులు. ఎకరాకు 26.50 బస్తాల దిగుబడి వచ్చినా గింజ పరిమాణం రైతులకు నచ్చడం లేదు.
- బీపీటీ 5204 సాంబమసూరి రకం పంటకాలం 143-145 రోజులు. ఎకరాకు 28.50 బస్తాల దిగుబడి వచ్చినా గింజ నాణ్యత, దిగుబడులు రైతులకు నచ్చడం లేదు.
- ఎంటీయూ 1318 రకం పంట కాలం 155-160 రోజులు. ఎకరాకు 30 బస్తాల దిగుబడి వస్తుంది. అధిక పిలకలు వేసి దిగుబడి బాగున్నప్పటికీ అపరాలు చేస్తున్న ప్రాంతానికి అనువుగా లేదు. వరి తర్వాత మొక్కజొన్న, వేరుశనగ, నువ్వులు సాగు చేస్తున్న ప్రాంత రైతులు ఆసక్తి చూపుతున్నారు.
- ఆర్‌జీఎల్ 2537 శ్రీకాకుళం సన్నాలు రకం 160 రోజుల్లో ఎకరాకు 30 బస్తాల దిగుబడి వస్తుంది. మధ్యస్థ సన్న గింజ రకం, 160 సెంటీమీటర్ల ఎత్తు పెరుగుతుంది. చేను ఎక్కువగా పడిపోతుంది.
- ఎంటీయూ 1224 మార్టేరు సాంబ రకం 135 రోజుల్లో ఎకరాకు 26 నుంచి 28 బస్తాల దిగుబడి వస్తుంది. పంట చేను పడిపోదు. బియ్యం పారదర్శకంగా ఉండి అన్నానికి అనుకూలం.
- బీపీటీ 3291 సోనామసూరి రకం 135 నుంచి 140 రోజుల్లో ఎకరాకు 25 బస్తాల దిగుబడి వస్తుంది. గింజ సన్నంగా ఉండి, అన్నానికి బాగుంటుంది.
- ఎంటీయూ 1061 ఇంద్ర రకం పంట కాలం 150 రోజులు. ఎకరాకు 30 బస్తాల దిగుబడి వస్తుంది. సన్న గింజగా ఉండి తెలుపు రంగులో ఉంటుంది. చేను పడిపోదు. 10 రోజుల వరకు ముంపును, కొద్దిపాటి చౌడును తట్టుకుంటుంది. అన్నానికి అనుకూలం.
- ఎంటీయూ 1064 అమర రకం 150 రోజుల్లో ఎకరాకు 25 బస్తాల దిగుబడి వస్తుంది. చేను పడిపోదు. గింజ రాలదు. సన్న రకం గింజ. ముంపును బాగా తట్టుకుంటుంది.

దళారులను నమ్మి మోసపోవద్దు

- ఈపీడీసీఎల్ హెచ్‌ఆర్ సీజీఎం రామకృష్ణ

విశాఖ సిటీ: విద్యుత్ శాఖలో ఉద్యోగాలిప్పిస్తామని నకిలీ నియామక పత్రాలను అందిస్తున్న మోసగాళ్లను నిరుద్యోగులు నమ్మొద్దని ఈపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్(హెచ్‌ఆర్) ఎం.రామకృష్ణ ఓ ప్రకటనలో సూచించారు. ఏపీఈపీడీసీఎల్‌లో ప్రస్తుతం ఎలాంటి నియామక ప్రక్రియ చేపట్టడం లేదని తేల్చి చెప్పారు. ఉద్యోగ నియామకాలు చేపడితే ఉద్యోగ ప్రకటన సంస్థ వెబ్‌సైట్, ప్రముఖ తెలుగు, ఆంగ్ల దిన పత్రికల్లో ప్రకటనలు ఇస్తామన్నారు. ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా పారదర్శకంగా నియామకాలు చేపడతామన్నారు. కాంట్రాక్ట్ ప్రాతిపదికపై సబ్ స్టేషన్లను నిర్వహించేందుకు కాంట్రాక్టర్లతో సంస్థ ఒప్పందం కుదుర్చుకుంటోందని, అందులో పనిచేసే సిబ్బందితో కానీ, వారి నియామక ప్రక్రియతో కానీ ఏపీఈపీడీసీఎల్‌కు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. సంస్థ పేరుతో నియామక పత్రాలు అందించేందుకు కాంట్రాక్టర్లకు కూడా అనుమతి లేదన్నారు. అయినప్పటికీ నిరుద్యోగులకు విద్యుత్ సబ్ స్టేషన్లలో కాంట్రాక్టు ప్రాతిపదికపై పనిచేసే షిఫ్ట్ ఆపరేటర్ పోస్టులకు నకిలీ నియామక పత్రాలు ఇచ్చి మోసగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వివరించారు. ఇలాంటి నకిలీ నియామకాలను నమ్మి మోసపోవద్దన్నారు. ఏపీఈపీడీసీఎల్‌లో ఉద్యోగ నియామకాల కోసం www. apeasternpower. com వెబ్‌సైట్‌లో గానీ, ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలోని హెచ్‌ఆర్ డిపార్ట్‌మెంట్ సీజీఎంను సంప్రదించవచ్చని తెలిపారు.

హైవే.. నో వే



ఎచ్చెర్ల మండలంలోని కుశాలపురంలో అమ్మవారి పండగ సందర్భంగా బుధవారం జాతీయ రహదారి స్తంభించిపోయింది. భోజనాలకు వచ్చిన వారితో దారి కిక్కిరిసిపోయింది. - శ్రీకాకుళం క్రైమ్

క్లుప్తంగా

కొనసాగుతున్న పాలిటెక్నిక్ కౌన్సెలింగ్


సహాయ కేంద్రంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తున్న అధ్యాపకులు

ఎచ్చెర్ల క్యాంపస్: పాలిటెక్నిక్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశానికి సాంకేతిక విద్యాశాఖ నిర్వహిస్తున్న పాలిసెట్ – 2024 కౌన్సెలింగ్ కొనసాగుతోంది. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తున్నారు. షెడ్యూల్ మేరకు బుధవారం 27001 నుంచి 43000 ర్యాంకు మధ్య విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించగా, 336 మంది హాజరయ్యారు. వీరిలో ఓసీ, బీసీ 305, ఎస్సీ, ఎస్టీ 31 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ నెల 27 నుంచి కౌన్సెలింగ్‌కు 951 మంది హాజరయ్యారు. గురువారం 43001 నుంచి 59000 ర్యాంకుల మధ్య ధ్రువీకరణ పత్రాలు పరిశీలించనున్నారు. జూన్ 3 వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ నెల 31 నుంచి జూన్ 4 వరకు కళాశాలలు, బ్రాంచ్‌ల ఎంపిక, 5న ఆప్షన్లు మార్పు, 7న ఎలాట్‌మెంట్లు ప్రకటించనున్నారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జి.దామోదర్‌రావు, అధ్యాపకులు మురళీకృష్ణ కౌన్సెలింగ్ పర్యవేక్షిస్తున్నారు.

నాట్యకారులకు స్వర్ణనంది అవార్డులు


అవార్డులతో నాట్యకారులు

ఇచ్ఛాపురం: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీకి చెందిన నాట్యకారులు శృతి పట్నాయక్, డి.కావ్య, ఎస్.శైలు, ఎస్.పూజ, సీహెచ్ జయలక్ష్మి, శ్వేతా రాణిలతో పాటు గాయకుడు, అకాడమీ అధ్యక్షుడు వెంకటేశ్వర పట్నాయక్(చిన్నా గురుస్వామి)లకు స్వర్ణనంది అవార్డులు వరించాయి. ఈ మేరకు ఎన్టీఆర్ 101 జయంతి సందర్భంగా హైదరాబాద్ పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో మంగళవారం అవార్డులను స్వీకరించినట్లు అధ్యక్షుడు తెలిపారు

సుధిష్ణకు గ్లోబల్ ఐకాన్ అవార్డు


అవార్డుతో మల్యాడ సుధిష్ణ

కాశీబుగ్గ: పలాస మండలం బొడ్డపాడుకు చెందిన జెస్సీ జానపద నృత్య కళాకారుల జట్టు సభ్యురాలు మల్యాడ సుధిష్ణకు గ్లోబల్ ఐకాన్ అవార్డు వరించింది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన గ్లోబల్ ఐకాన్ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా సుధీష్ణ ప్రదర్శనకు మెచ్చి అవార్డు అందించారు. ఈమె స్వగ్రామం కంచిలి మండలం కొర్లాం గ్రామం. తల్లి నాగమణి పోస్టల్‌శాఖలో పని చేస్తుండగా, తండ్రి ఈశ్వరరావు సెలూన్ షాప్ నడుపుతూ కుమార్తెను ప్రోత్సహిస్తున్నారు. సుధిష్ణకు అవార్డు దక్కడం పట్ల జెస్సీ జానపద కళాకారుల జట్టు అధ్యక్షుడు కిక్కర డిల్లీరావు, ఉద్దాన ప్రాంత జానపద కళావేదికలు, కళాకారులు, కళాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

జీడి..తగ్గిన దిగుబడి

- ప్రతికూల వాతావరణ పరిస్థితులే కారణం
- జిల్లాలో 55600 ఎకరాల్లో జీడిమామిడి సాగు
- గతేడాది 17వేల టన్నులు రాగా ఈ ఏడాది 10 వేల టన్నులకే పరిమితం
- యాజమాన్య పద్ధతులు పాటించాలంటున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు


జీడిమామిడి చెట్టు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): జీడిమామిడి దిగుబడిపై ప్రతికూల వాతావరణ పరిస్థితులు తీవ్ర ప్రభావం చూపించాయి. గతంతో పోల్చితే ఈ ఏడాది దిగుబడులు గణనీయంగా తగ్గడందో జీడి రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ప్రధానంగా ఉద్దానం ప్రాంతమైన పలాస, వజ్రపుకొత్తూరు, మందస, సోంపేటతో పాటు రణస్థలం, ఎచ్చెర్ల మండలాల్లో అధికంగా జీడి సాగు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 55,600 ఎకరాల్లో జీడితోటలు విస్తరించి ఉన్నాయి. వాతావరణం అనుకూలించడంతో ఏటా 17వేల టన్నుల వరకు జీడి దిగుబడి వచ్చేది. ఈ ఏడాది ప్రతికూల పరిస్థితుల కారణంగా 10వేలు టన్నులకే పరిమితమయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇదే జరిగితే జీడిపప్పు ధర మరింతగా పెరుగుతుందని చెబుతున్నారు. ఏటా ఎకరాకు 5 బస్తాల జీడి దిగుబడి వచ్చేది. ఈ ఏడాది మూడు బస్తాలకు పడిపోయింది. ఈ ఏడాది లాభాలు వచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతుఉ గగ్గోలు పెడుతున్నారు. నాణ్యతను బట్టి 80 కేజీల బస్తా రూ.8వేలు నుంచి రూ.12 వేలు ధర పలుకుతోంది.


కారణాలు ఇవే..

జిల్లాలో ఉద్యాన పంటలలో అత్యధిక వాణిజ్య విలువలు, య వనరులు సమకూర్చే పంటలలో జీడిమామిడి ప్రధానమైంది. అయితే ఈ సంవత్సరం ప్రతికూల వాతావరణం కారణంగా దిగుబడులు అనుకున్నంత ఆశాజనకంగా లేవు. సకాలంలో వర్షాలు లేకపోవడంతో పాటు ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటంవల్ల మొదటి దశ పూత ఆలస్యమైంది. దీనికి తోడు పూత సమయంలో మంచు అధికంగా పడటంతో పూత, పిందె మాడిపోయినట్లు అధికారులు చెబుతున్నారు.

యాజమాన్య పద్ధతులు ఇలా..

- జీడిమామిడిలో జూన్, జూలై నెలల్లో తొలకరి వర్షాలకు జీడి చెట్ల వరుసల మధ్య కలుపు నివారణకు చెట్ల మొదల నుంచి 1.5 మీటర్లు వదిలి వేర్లకు నష్టం కలగకుండా దున్నుకోవాలి.
- భూసార అభివృద్ధికి వరుసల మధ్య తేలికగా నేలలో కలిసి సులువుగా కుళ్లిపోయే పచ్చిరొట్ట పంటలు వేసుకుని 35 నుంచి 40 రోజులు పెంచి నేలలో కలియదున్నాలి.
- జీడి మామిడిలో లేత తోటల్లో భూమి నుంచి మీటరు ఎత్తు వరకు ఉన్న కింది కొమ్మలను కత్తిరించి ఏపుగా వృత్తాకారంలో పెరిగేలా మొక్కను ట్రైనింగ్ చేయాలి.
- ముదురు తోటల్లో ప్రతి రెండేళ్లకు ఒకసారి ఎండు కొమ్మలు, భూమికి ఆనుకుని ఉన్న కొమ్మలు, ఇతర చెట్ల మీదకు పోయిన కొమ్మలు, నీడను ఉన్న కొమ్మలను కత్తిరించుకోవాలి. ఇలా చేయడం వల్ల మొక్కలకు తగినంత సూర్యరశ్మి, వెలుతురు, గాలి సోకి కొమ్మలు, పూత ఎక్కువగా వచ్చి దిగుబడి పెరుగుతుంది.
- వర్షాధారపు తోటల్లో పాదులకు మల్చింగ్ చేసి వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలి. ఈ నీరు కొత్త చిగురు రావడానికి, త్వరగా మొదలుపెట్టడానికి ఉపయోగపడుతుంది.
- పోషక లోపాలు, సూక్ష్మ పోషక లోపాలుంటే నీటిలో కరిగే పోషక మిశ్రమాలను ఫార్ములా–4 ఐదు గ్రాములు లీటరు నీటికి చెట్టుపై పిచికారి చేసుకోవాలి. చెట్టుకు 1100 గ్రా.యూరియా, 750గ్రా. సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 200 గ్రా మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌తో పాటు 10 కేజీల కుళ్లిన పశువుల ఎరువుగా అందించాలి.
- ఏడేళ్లపై వయస్సుగల చెట్ల కాండం మొదలు, భూమిపైన కనపడే వేర్లను సన్నని ఇనుప వైరుతో చేసిన బ్రష్‌తో బాగా రుద్ది ఆ తరువాత బాగా తడిచేలా 5 శాతం వేప నూనె ద్రావణాన్ని నాలుగు నెలలకు ఒకసారి చొప్పున సంవత్సరంలో మూడు సార్లు పిచికారీ చేయాలి.
- వేప నూనె నీటిలో కరగదు కాబట్టి ప్రతి లీటరు నీటికి 0.5 గ్రాములు సబ్బు కానీ, సర్ఫ్ కానీ కలిపి గిలగకొట్టి 50మి.లీ. వేప నూనెను కలిపి బాగా కలిసేటట్లు పుల్లతో కలియబెట్టాలి.
- ఈ పురుగు ఆశించే చెట్ల నుంచి బంక కారుతూ ఉంటుంది. వెంటనే బెరడు కింద దాగివున్నా లద్దెపురుగులను తొలిగించాలి.
- బెరడు చెక్కిన చోట వెంటనే కార్బరిల్ 4.0 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఈ పురుగులను తొలగించకపోతే క్రమేపీ చెట్లు చనిపోయే అవకాశం ఉంటుంది. చెక్కిన బెరడు మొక్కలను కాండం నుంచి కారిన బంకను చెక్కపొడిని భూమిలో పాతిపెట్టాలి.
- తోటలను పరిశుభ్రంగా ఉండాలి. తుదిదశలో పురుగులు సోకిన చెట్ల ఆకులు పసుపు రంగుగా మారతాయి. ఆ తర్వాత ఆకులు రాలి మోడువారి ఎండిపోయి చనిపోతాయి. కాబట్టి ఆకులు పూర్తిగా పసుపు రంగుకు మారగానే చెట్లను వెంటనే వేర్లతో సహా తీసివేసి వేర్లలో దాగి ఉన్న ప్యూపాలను చంపి సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.
- టీ దోమ తల్లి పిల్లపురుగులు లేత కొమ్మలను, పూతరెమ్మలను ఆశించి రసాన్ని పీల్చడం వల్ల ఎర్రని జిగురుబిందువులు పూతరెమ్మలపై నల్లని పొడవైన కండే ఆకారపు మచ్చలు ఏర్పడతాయి. పూత, పిందెలు మాడిపోవటం వల్ల దిగుబడి తగ్గుతుంది.
- విపరీత పరిస్థితుల్లో చెట్లంతా మాడిపోయినట్లవుతుంది. డిసెంబర్, మార్చి నెలలో అవసరాన్ని బట్టి రెండు లేక మూడు సార్లు పురుగు మందులను పిచికారి చేసి అన్ని పురుగులను అదుపు చేయవచ్చు.
- మొదటిగా మోనోక్రోటోఫాస్ డిసెంబర్ జనవరిలో (1.4 మి. లీ./లీ.), రెండవసారి ఎండోసల్ఫాన్‌ను జనవరి ఫిబ్రవరిలో (1.4 మి. లీ./లీటరు), మూడవసారి అవసరమైతే కార్బరిలను మార్చిలో (2 గ్రా./లీటరు) పిచికారి చేసి అన్ని రకాల పురుగులను అదుపులోకి తీసుకురావచ్చు. పైమందులు కాక క్లోరిపైరిఫాస్ (2.5 మి. లీ/ లీటరు నీటికి) ప్రొఫెనోఫాస్ (1.0 మి.లీ/లీటరు) నీటికి కూడా వినియోగించవచ్చు.

ముందస్తు జాగ్రత్తలే మేలు..



జీడిమామిడి పంటదశ ముగిసినప్పటి నుంచే రైతులు యాజమాన్య పద్ధతులపై దృష్టి సారించాలి. పంట దిగుబడి తగ్గిందని నిరాశ చెందకుండా గతేడాది నష్టాన్ని భర్తీ చేసుకోవాలంటే పంట ప్రారంభ దశ నుంచే ప్రణాళికబద్ధంగా జాగ్రత్తలు పాటించాలి. ఉద్యానవన శాఖ అధికారుల నుంచి తగిన సూచనలు, సలహా తీసుకోవాలి.

–ఆర్.వి ప్రసాద్, ఉద్యానశాఖ అసిస్టెంట్ డైరెక్టర్, శ్రీకాకుళం

పోక్సో కేసు నమోదు

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం రూరల్ పోలిస్‌స్టేషన్ పరిధిలో బుధవారం పోక్సో కేసు నమోదైంది. రూరల్ ఎస్‌ఐ వాసుదేవరావు తెలిపిన వివరాల మేరకు.. లోపింటి నర్సింహులు రాగోలులో అద్దెకు నివాసం ఉంటున్నాడు. ఈయన స్వస్థలం జలుమూరు మండలం గొటివాడ. స్థానికంగా ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆ గ్రామంలో చదువుతున్న మైనర్ బాలికను కొన్నేళ్లుగా ప్రేమ పేరుతో లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడు. పదో తరగతి పరీక్షలు పూర్తయ్యాక బాలిక తల్లిదండ్రులతో పాటు శ్రీకాకుళం నగరానికి వచ్చేసింది. అయినప్పటికీ తన వెంట పడుతూ వేధిస్తున్నాడంటూ బాధిత బాలిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు డీఎస్పీ వై.శృతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని మండలవీధిలో నివాసముంటున్న ఓ మహిళ తన కుమార్తె అదృశ్యమైందంటూ శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేసింది. తన కుమార్తె గొంటివీధిలో ఉన్న ఓ ప్రయివేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోందని, రాజమండ్రికి చెందిన పోలరాజుతో పరిచయముందని, అతను తరచూ ప్రేమిస్తున్నానంటూ ఫోన్‌కాల్స్, మెసేజ్‌లు చేస్తుంటాడని, అతనిపైనే అనుమానముందంటూ ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గణేష్ పేర్కొన్నారు.

1న ఐక్యవేదిక సదస్సు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణ, ప్రధానకార్యదర్శి బాజీపఠాన్ ఆధ్వర్యంలో జూన్ 1న ఐక్యవేదిక సదస్సు నిర్వహించనున్నట్లు స్టీరింగ్ కమిటీ శ్రీకాకుళం ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు ఐక్యవేదిక సమావేశానికి అధిక సంఖ్యలో హాజరవ్వాలని కోరారు.

ఘనంగా శ్రీవారి జన్మనక్షత్ర పూజలు


స్వామివారికి అభిషేకం


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలో కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రం సందర్భంగా అర్చకులు బూరాట వంశీ ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాభిషేకాలు, నిజరూప దర్శనం, హోమం, నక్షత్ర హారతి, కుంభహారతి తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు నగరవీధుల్లో హరినామ సంకీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు లోకనాథం నందికేశ్వరరావు, అధ్యక్ష కార్యదర్శులు మర్రి యోగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

కాశీబుగ్గ: మందస మేజర్ పంచాయతీకి చెందిన కాశీ విశ్వేశ్వరరావు బుధవారం అనుమానస్పదంగా మరణించారు. ఎల్‌ఐసీ ఏజెంట్‌గా పనిచేస్తున్న ఈయన తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మరణించారని ప్రచారం జరగడంతో పెద్ద ఎత్తున ప్రజలు అక్కడికి చేరుకున్నారు. హత్య..ఆత్మహత్యా? అనే అంశంపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. మందస పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపడుతూ కేసు నమోదు చేశారు. పూర్తి స్థాయిలో దర్యాప్తు అనంతరం వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

క్షణికావేశాలతో వివాదాలకు పాల్పడవద్దు


వివాద కారణాలను తెలుసుకుంటున్న డీఎస్పీ, సీఐలు

నరసన్నపేట: గ్రామాల్లో ప్రతిచిన్న విషయానికీ క్షణికావేశాలకు పోకుండా సంయమనం పాటించాలని టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి అన్నారు. కోమర్తిలో సోమవారం సాయంత్రం జరిగిన వివాదం నేపథ్యంలో ఇరువర్గాలతో బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో మాట్లాడారు. వివాద కారణాలను తెలుసుకున్నారు. అనంతరం కౌన్సిలింగ్ నిర్వహించారు. కోమర్తిలో జరిగిన వివాదానికి కారణాలను సర్పంచ్ చిన్నమ్ముడు భర్త, వైఎస్సార్ సీపీ నాయకుడు ఉంగటి రాజును అడిగి తెలుసుకున్నారు. తనపై అకారణంగా దాడి చేశారని తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి విషయానికీ వివాదాలకు పాల్పడం మంచిది కాదన్నారు. కౌంటింగ్ అయినంత వరకూ అందరూ శాంతియుతంగా మెలగాలన్నారు. మళ్లీ వివాదాలకు దిగితే కఠిన చర్యలు తప్పవని, అవసరమైతే రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. ఈయన వెంట నరసన్నపేట సీఐ బి.ప్రసాదరావు, ఎస్‌ఐ అశోక్ బాబు ఉన్నారు.

నిందితుడి కోసం కొనసాగుతున్న గాలింపు

శ్రీకాకుళం క్రైమ్ :

నగరంలోని గూనపాలెంలో ఈ నెల 16న అర్ధరాత్రి భార్య తిరుమల, ఆమె ప్రియుడు, మరో వ్యక్తి చేతిలో సీరా సురేష్ (32) హత్యకు గురైన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుడి జాడ ఇంకా దొరకలేదు. హత్య జరిగిన కొద్ది రోజుల్లోనే పోలీసులు కేసు ఛేదించి భార్య తిరుమల, ప్రియుడు రియాజ్‌ఖాన్‌కు సహకరించిన నురుద్దీన్‌ఖాన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే రియాజ్‌ఖాన్ ఇప్పటికీ పోలీసులకు చిక్కకపోవడం చర్చనీయాంశంగా మారింది. రియాజ్‌ఖాన్ సొంతూరు ఒడిశా రాష్ట్రం జాజ్‌పుర్ జిల్లాలోని ఓ మారుమూల గ్రామం. ఒకటో పట్టణ పోలీసులు అతని కోసం అక్కడ గాలిస్తున్నా అతని మొబైల్ ఫోన్ సిమ్ తీసేయడంతో పట్టుకోవడం కష్టతరంగా మారింది.

అనాథలైన పిల్లలు..

హత్యకు గురైన సురేష్‌కు తండ్రి రామయ్య, భార్య తిరుమలతో పాటు కుమారుడు(13), కుమార్తె (08) ఉన్నారు. తండ్రి హత్యకు గురవ్వడం, తల్లి జైలు పాలవ్వడంతో పిల్లలు అనాథలుగా మిగిలారు. తాత రామయ్య వృద్ధుడు కావడంతో ఇంటి పట్టునే ఉంటున్నాడు. ఒక్క వృద్ధాప్య పింఛనే అతనికొచ్చే ఆదాయ వనరు. అదీ అద్దె ఇంట్లో నివసిస్తుండటం, పిల్లలను ఎలా సాకాలో తెలియక వృద్ధుడు సతమతమవుతున్నాడు. పోలీసులు దర్యాప్తు వేగవంతం చేసి తన కొడుకుని చంపిన వారందరికీ శిక్ష పడేలా చూడాలని వృద్ధుడు వేడుకుంటున్నాడు.

ఆకట్టుకున్న గణిత అష్టావధానం


గణిత అష్టావధానం నిర్వహిస్తున్న దృశ్యం


బాల అవధాని రోహిత్


శ్రీకాకుళం కల్చరల్: గణితంలో ప్రాశ్నకులు వేసే ప్రశ్నలకు అలవోకగా సమాధానాలు చెబుతూ బాలమేధావి–గణిత అవధాని కె.వి.ఎస్.రోహిత్ అందరినీ ఆకట్టుకున్నాడు. రోహిత్‌తోపాటు విశ్రాంత గణిత ఉపన్యాసకులు నిష్టల నర్సింహమూర్తి కూడా అవధానిగా పాల్గొన్నారు. శ్రీకాకుళం బాపూజీ కళామందిర్‌లో ఉపనిషన్మందిరం ఆధ్వర్యంలో బుధవారం గణిత అష్టావధానం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. భగవద్గీత శ్లోక సంఖ్యలు తదితర అంశాలపై ఎస్.నారాయణ మూర్తి, గణితంలో వర్గాలపై ప్రసాద్, గుణకారాలపై అరుణ, మాయాచదరంపై జి.శ్రీనివాస్, ఘనమూలాలు (క్యూబ్స్, రూట్స్)పై సీహెచ్ రాజ్‌కుమార్, పీరియాడిక్ టేబుల్‌పై డి.సంతోష్, క్యాలెండర్‌పై బి.వి.ఎస్.సాయిరాం, అప్రస్తుతం ప్రసంగంతో కె.వి.రాజారావులు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పి ప్రేక్షకులను అలరించారు. గణిత అవధానం 4 ఆవృతాలలో జరిగింది. కార్యక్రమంలో మందిరం అధ్యక్షుడు గుమ్మానగేష్, ఇప్పిలి శంకరశర్మ, బి.మల్లేశ్వరరావు, నిక్కు అప్పన్న, సురంగి మోహనరావు, మందుల మోహనరావు, పులఖండం శ్రీనివాసరావు, పతంజలి శాస్త్రి, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఐఎన్ఐఎస్ఎస్ పరీక్షలో గాయిత్రీ శ్వేత ప్రతిభ


గాయిత్రీ శ్వేత

నరసన్నపేట: స్థానిక పంచాయతీరాజ్ డీఈ గుణుపూరు సత్యంనాయుడు కుమార్తె గాయిత్రీ శ్వేత డాక్టర్ ఆఫ్ మెడిషన్ సీటును కై వసం చేసుకున్నారు. రీప్రొడెక్టివ్ మెడిషన్‌లో స్పెషలైజేషన్‌కు ఎంపికై స్త్రీల వ్యాధులకు సంబంధించి సూపర్ స్పెషాలిటీ చేయనున్నారు. దేశ స్థాయిలో డాక్టర్ ఆఫ్ మెడిషన్ పోస్టుల కోసం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్(ఐఎన్ఐ) సూపర్ స్పెషాలిటీ (ఎస్ఎస్) పరీక్ష ఇటీవల నిర్వహించారు. ఇందులో గాయిత్రీ శ్వేత 76.667 మార్కులు పొంది సీటు దక్కించుకున్నారు. న్యూఢిల్లీ ఎయిమ్స్‌లో డాక్టరేట్ ఆఫ్ మెడిషన్ పూర్తి చేయనున్నారు. కాగా గాయిత్రీ శ్వేత తండ్రి సత్యంనాయుడు నరసన్నపేటలో పంచాయతీరాజ్ డీఈగా పనిచేస్తుండగా, తల్లి రమణమ్మ న్యాయవాది. విజయనగరంలో ప్రాక్టీసు చేస్తున్నారు.


జనజీవన 'చిత్రం'


కుమ్మరి జీవనశైలి


తన నీడను చూస్తున్న పక్షి బొమ్మ


గ్రామీణ ప్రాంత యువతి


మత్స్యకార జీవనశైలి చిత్రం


మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పెన్సిల్ డాట్ చిత్రం


సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెన్, పెన్సిల్ ఆర్ట్


రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పెన్సిల్ డాట్ చిత్రం


అబ్రహం కుంచె నుంచి జాలువారిన యువతి చిత్రం

ఆయన వేసిన చిత్రాలు జీవం ఉట్టిపడే కళాత్మక రూపాలు.. కళ్లతో చూసిన ఏ దృశ్యాన్నైనా కుంచెతో అద్భుతమైన చిత్రంగా మలచడం ఆయనకు ఉన్న ప్రత్యేకత.. టెక్కలికి చెందిన కణితి అబ్రహం ప్రకృతి రమణీయ దృశ్యాలు, గ్రామీణ ప్రాంత పరిసరాలు ఉట్టిపడే చిత్రాలు వేయడంలో సిద్ధహస్తులు. మహిళలు, సంప్రదాయాలు, వివిధ కుల వృత్తుల జీవన శైలీ కళాత్మక రూపాలు.. ఇలా ఒకటేంటి అనే ప్రయోగాలు చేస్తూ అద్భుత చిత్రాలు గీస్తుంటారు..ఆయన వేసిన కొన్ని చిత్రాలు..

– టెక్కలి


కణితి అబ్రహం